క్లుప్తంగా

ఎంఆర్‌సీకి చేరిన యూనిఫామ్ క్లాత్



యూనిఫామ్ క్లాత్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రభు త్వ పాఠశాలల్లో చదువుతున్న 3,472 మంది విద్యార్థుల కోసం యూనిఫామ్ క్లాత్ బుధవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయానికి చేరినట్లు ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. జగనన్న విద్యా కానుకలో భాగంగా విద్యార్థులకు పాఠశాలలు తెరచిన వెంటనే యూనిఫాంను అందజేస్తానన్నారు. ఇప్పటికే నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, బెల్ట్సు చేరాయని తెలిపారు. సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్ పదవికి రాజీనామా

నారాయణవనం: మండలంలోని ప్రసిద్ధ కైలాసనాథకోనలోని శ్రీకామాక్షాంబిక సమేత కై లాసనాథస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పదవికి, కమిటీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు సుబ్రమణ్యంయాదవ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమితో మనోవేదనకు గురై రాజీనామా చేసినట్లు, లేఖను దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు పంపినట్లు పేర్కొన్నారు.

కండలేరులో 6.582 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 6.582 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..



పార్టీ శ్రేణులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



నాయకులతో మాట్లాడుతున్న బియ్యపు పవిత్రారెడ్డి

- ఊహకందని ఫలితాలు
- ఓటమికి కారణాలను విశ్లేషిస్తాం
- పార్టీశ్రేణులు సంయమనం పాటించాలి
- మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: 'రాష్ట్రంతోపాటు నియోజకవర్గంలోనూ ఊహకందని ఫలితం ఎదురైంది.. ఓటమి జీర్ణించుకోని పరిస్థితుల్లో ఉన్న మన కార్యకర్తలను టీడీపీ అనుచరులు రెచ్చగొట్టినా, అల్లర్లకు ప్రేరేపించినా ఎక్కడా సంయమనం కోల్పోవద్దు' అని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయనను బుధవారం సాయంత్రం నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పెద్దఎత్తున కలిశారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై విశ్లేషించారు. ఎన్నికల ఫలితాలపై కార్యకర్తలందరూ అనుమానాలు వ్యక్తం చేశారు. మండలాల వారీగా తగ్గిన మెజారిటీ, గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లను సరిపోల్చి ఇంత ఘోరమైన ఫలితాలు వచ్చే అవకాశం ఏ మా త్రం లేదని కార్యకర్తలంతా చర్చించారు. అలాగే ఆయన కుమార్తె, వైఎస్సార్ సీపీ రేణిగుంట ఇన్ చార్జి బియ్యపు పవిత్రారెడ్డితో రేణిగుంట, తొట్టంబేడు మండలాలకు చెందిన పార్టీ కార్యకర్తలు, నాయకులతో విడిగా ఫలితాలపై సమాలోచన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఐదేళ్లు అందుబాటులో ఉండి, ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించి తో డుగా నిలిచానని గుర్తు చేశారు. సొంత నిధులతో ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టి అండగా నిలిచానన్నారు. జగనన్న సంక్షేమ పాలనలో లబ్ధి పొందిన పేద ప్రజల ఓట్లన్నీ ఏమయ్యాయో అంతుపట్టడం లేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఏమి జరిగినా పార్టీ శ్రేణులు ఓపిగ్గా ఉండి, జరిగే పరిణామాలను నిశితంగా పరిశీలిస్తూ గ్రామాల్లో సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలకు అండగా నిలవాలని కోరారు. కొత్త ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, మండల స్థాయి, పట్టణ నేతలు ఉన్నం వాసుదేవనాయుడు, కలవగుంట శ్రీనివాసులురెడ్డి, వయ్యాల కృష్ణారెడ్డి, కూనాటి రమణయ్యయాదవ్, సిరాజ్‌బాషా, లోకేష్‌యాదవ్, పగడాల రాజు, పీజే చంద్రయ్యశెట్టి, కోవి చంద్రయ్యనాయుడు, స్వర్ణమూర్తి, పాండు, చక్రాల ఉష, అంపాశెం ఈశ్వర్‌రెడ్డి, ప్ర మీలమ్మ, కతా ఉదయ్, మొగరాల గణేష్, ప్రభాకర్, అరవింద్‌రెడ్డి, రత్నంరెడ్డి, సామిరెడ్డి భర త్‌రెడ్డి, రాముగుప్తా, శివయాదవ్, ఉత్తరాజి శరవ ణకుమార్, గోరా, మున్నా, రఘునాయుడు, రఘురెడ్డి, కొల్లు హరినాథ్‌నాయుడు, పాలమంగళం శివ, కల్యాణి, గరికపాటి చంద్ర, ఫయాజ్, యోగా, మస్తాన్, ధన, రవి పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో విద్యార్థుల ప్రతిభ



లక్ష్మణ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం, హేమకుమారి, రోహిత్, దీపిక

తొట్టంబేడు : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు నిర్వహించిన పరీ క్ష(2023-24)లో శ్రీకాళహస్తి మండలం ఓబులాయపల్లె ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పి.లక్ష్మణ్ అర్హత సాధించాడు. విద్యార్థికి ఐదేళ్లపాటు స్కాలర్‌షిప్ అందనుంది.

వేదాం ఉన్నత పాఠశాల్లో ..

శ్రీకాళహస్తి మండలం వేదాం ఉన్నత పాఠశాల విద్యార్థులు హేమకుమారి, రోహిత్ ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో స్కాలర్ షిప్‌నకు ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

కల్లివెట్టు విద్యార్థిని..

బుచ్చినాయుడుకండ్రిగ: తమ పాఠశాల విద్యార్థిని దీపిక ఎన్ఎంఎంఎస్(జాతీయ ఉపకార వేతన పరీక్ష)లో ఉత్తీర్ణురాలై స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు కల్లివెట్టు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రూపేష్‌కుమార్ తెలిపారు. బాలికకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనం అందుతుందన్నారు. దీపికను ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

నారాయణవనం: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు హెచ్‌ఎం శశికళ వెల్లడించారు. బుధవారం మీడియాతో ఆమె మాట్లాడుతూ గత ఏడాది ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసి ఎంపీసీ, బైపీసీ గ్రూపుల అడ్మిషన్లకు అనుమతులు ఇచ్చిందన్నారు. తొలి ప్రయత్నంలోనే తమ విద్యార్థులు ప్రథమ ఇంటర్‌లో 82 శాతం ఉత్తీర్ణతతో 400 మార్కులకు పైగా సాధించారని అన్నారు. బాలికలకు మాత్రమే ఒక్కో గ్రూపులో 40 సీట్లకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు, నారాయణవనం, పరిసర గ్రామాల వారు 10వ తరగతి పాసైన తమ కుమార్తెలను బాలికల హైస్కూల్ ప్లస్‌లో చేర్చాలని సూచించారు.

భూమనను కలిసిన ఎంపీ, మాజీ ఎమ్మెల్యే



మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని, భూమన అభినయ్‌రెడ్డిని కలిసిన ఎంపీ గురుమూర్తి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, నేతలు

తిరుపతి మంగళం : సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించిన తిరుపతి ఎంపీ గురుమూర్తి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బుధవారం తిరుపతి పద్మావతిపురంలోని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వెలువడిన ఎన్నికల ఫలితాలపై చర్చించారు. అనంతరం పార్లమెంట్ సభ్యుడుగా విజయం సాధించిన మద్దిల గురుమూర్తిని భూమన కరుణాకరరెడ్డితోపాటు భూమన అభినయ్‌రెడ్డి అభినందించారు. తిరుపతిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున భూమన నివాసం వద్దకు వచ్చి ఊహకందని ఫలితాలు రావడంపై చర్చించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



కరపత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని మండలంలోని కల్లివెట్టు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రూపేష్‌కుమార్ తెలిపారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని, విద్యార్థుల ఫొటో, మార్కులు ప్రచురించిన కరపత్రాలతో బుధవారం తలారివెట్టు, మొక్కలచేను, గాంధీ గిరిజన కాలనీల్లో ఉపాధ్యాయులు యువశ్రీమురళి, మురళి, దాసుతో కలసి ఆయన ఇంటింటి ప్రచారంలో చేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేలా బోధన సాగుతున్నట్లు తెలిపారు. గోరుముద్ద, విద్యాకానుక, అమ్మ ఒడి, నాడు-నేడు, ట్యాబ్‌లతో బైజూస్ పాఠాల బోధన తదితరాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందుతున్నాయని వివరించారు.

బాలలందరినీ బడికి పంపాలి



తనిఖీ చేస్తున్న అధికారులు

రేణిగుంట: చిన్న పిల్లలందరినీ బడికి పంపాలని తిరుపతి రెండో సర్కిల్ సహాయ కార్మిక అధికారి(రేణిగుంట పరిధి) శ్రీమాన్ నారాయణ సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం రేణిగుంటలోని దుకాణాలు, హోటళ్లు, సంస్థల్లో ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులతో మాట్లాడుతూ బాల కార్మిక చట్టం 1986 ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకో కూడదని తెలిపారు. బాలలను పనిలో పెట్టుకున్న యజమానులకు కఠిన శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ బీవీఎస్ కృష్ణారెడ్డి, అధికారులు జి.రంగనాథ్, డి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

తిరుపతి(తుడా): ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ తెలిపారు. వైద్య కళాశాలలో బుధవారం ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆస్పత్రి, చిన్న పిల్లల విభాగం వైద్యాధికారులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభు, ఎస్వీ వైద్య కళాశాల క్యాన్సర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నోడల్ అధికారి డాక్టర్ వై.వెంకట్ లక్ష్మీ, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్లు రోజారమణి, చండీప్రియ, సునీత పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం







శ్రీకాళహస్తి : మొక్కలు నాటే కార్యక్రమంలో కమిషనర్ రమేష్‌బాబు, స్కౌట్ విద్యార్థులు, బీఎన్‌కండ్రిగ: కల్లివెట్టు పాఠశాలలో.., సత్యవేదు: మొక్కలు నాటుతున్న ఎఫ్‌ఆర్వో జయప్రసాద్ రావు

శ్రీకాళహస్తి: మానవ మనుగడకు మొక్కలే ఆధారమని, పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని రోవర్స్ కమిషనర్ టి.రమేష్‌బా బు అన్నారు. పట్టణంలోని బాబు అగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలను నాటారు. ఆయన మాట్లా డుతూ రోజురోజుకు పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. వాతావరణ సమతుల్యతకు మొక్కలు దోహదం చేస్తాయన్నారు. ప్రాణవాయువును అందించే మొక్కలు నాటడం ఎంతో అవసరమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణతో పాటు మానవుని ప్రాణాలకు రక్షణ చేకూర్చే ఔషధ మొక్కలు నాటాలని తెలిపారు. జిల్లా ట్రైనింగ్ కమిషనర్ సావిత్రి, యూత్ చైర్మన్ ఎస్‌కే అజారుద్దీన్, గైడ్ కెప్టెన్ దేవి తదితరులు పాల్గొన్నారు.

సత్యవేదు రిజర్వ్ ఫారెస్ట్‌లో..

సత్యవేదు: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఫారెస్టురేంజ్ అధికారి జి.జయప్రసాద్‌రావు అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సత్యవేదు రిజర్వు ఫారెస్ట్‌లో అధికారులు మొక్కలు నాటారు. రేంజ్ అధికారి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటి, సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎఫ్ఎస్ఓ దేవరాజులు, ఎఫ్‌బీఓ చెంగల్రాయులు, రెడ్డెప్ప, ప్రకాష్, పాల్గొన్నారు.

ఖైదీలకు అవగాహన

ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా బుధవారం జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు న్యాయవాదులు పట్టణంలోని ఉపకారాగారంలో ఖైదీలకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలను నాటారు. న్యాయవాదులు రాజేశ్వర రావు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుందని హెచ్‌ఎం రూపేష్‌కుమార్ తెలిపారు. బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పిచ్చాటూరు: ముడియూరులో ..



రేణిగుంట : మామండూరులో మొక్కలు నాటే కార్యక్రమంలో డీఆర్‌ఓ

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

పిచ్చాటూరు: మొక్కలునాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఉపాధి ఏపీఓ నాగభూషణమ్మ పిలుపునిచ్చారు. బుధవారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మండలంలోని తులసికృష్ణాపురంలో ఉపాధి కూలీలతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏపీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. వివిధ కారణాలతో రోజురోజుకు చెట్లు అంతరించి పోతుండడం కారణంగానే సకాలంలో వర్షాలు పడడం లేదని తెలిపారు. ఇన్‌చార్జ్ జేఈ పుష్పరాజ్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మండలంలో..

తొట్టంబేడు : జీవావరణ వ్యవస్థను కాపాడుకోవాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవడమే మార్గమని ప్రగతి స్వచ్ఛంద సంస్థ నిర్వహకుడు ప్రభాకర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం శ్రీకాళహస్తి మండలం ఎర్రగుడిపాడులో సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాతావరణంలో సంభవించే వినాశకర మార్పులను నిరోధించి పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించడమే మార్గమన్నారు. పంచాయతీ కార్యదర్శులు వినోద్‌కుమార్, సాయి విజయకుమార్, మహిళా సంరక్షణ కార్యదర్శి అనూష తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్తు

రేణిగుంట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ మొక్కలు విరివిగా నాటాలని మామండూరు అటవీశాఖ డీఆర్‌వో ఎస్.గౌస్‌కరీం అన్నారు. మండలంలోని మామండూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. అలాగే మండలంలోని కరకంబాడి అమరరాజ కర్మాగారం ఆవరణలో అమరరాజ ఎనర్జీ అండ్ మొబిలిటీ ఆపరేషన్స్ హెడ్ శ్రీనివాసరావు, ఏఎస్ బీయూ ఆపరేషన్స్ హెడ్ మునీశ్వర్‌నాయుడు ఆధ్వర్యంలో 1,550మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత, పచ్చదనం పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు.



శ్రీకాళహస్తి సబ్‌జైలులో..

మొక్కల పంపిణీ

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో పర్యా వరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేశవులు ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేశారు. మండలంలోని పోతు మానిగుంట, చిందేపల్లి ఎస్టీకాలనీల్లో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది.

జిల్లా స్థాయిలో విద్యార్థినుల ప్రతిభ

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపినట్లు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు సునీత తెలిపారు. ఆమె మాట్లాడుతూ బుధవారం విజయవాడ ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఏపీసీఓఎస్టీ) ఆదేశాల మేరకు పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 12 తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగినట్లు వివరించారు.తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని విద్య పోస్టర్ ప్రజెంటేషన్(పర్యావరణ సంరక్షణ తెలియజేసే వివిధ పద్ధతులు)లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, పదవ తరగతికి చెందిన సుప్రజ వ్యాసరచన పోటీల్లో(అన్ని చోట్ల మొక్కలతో పర్యావరణ సంరక్షణ ఎలా?) జిల్లా స్థాయి తృతీయ స్థానాన్ని సాధించినట్లు తెలిపారు. విజేతలకు డీఈఓ శేఖర్ మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేసినట్లు చెప్పారు. విద్యార్థినుల ప్రతిభపట్ల పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



డీఈఓ శేఖర్ నుంచి మెడల్, ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న విద్య




తొట్టంబేడు : ఎర్రగుడిపాడులో..



పాపానాయుడుపేటలో మొక్కల పంపిణీ

వర్షంతో పైర్లకు ఊరట



పెళ్లకూరులో వరి సాగు

సైదాపురం: మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం నుంచి ఓ మోస్తారు పాటు వర్షం కురిసింది. ఎగువ ప్రాంతాల నుంచి కూడా నీరు వచ్చి చేరుతుండడంతో కైవల్యా నదికి జలకళ వచ్చింది. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఎండుతున్న పైర్లకు ఊపిరి వచ్చినట్లు అయ్యిందని రైతులు చెబుతున్నారు.

నిమ్మ రైతులకు ఊరట..

నిమ్మ రైతులకు ఈ వర్షంఊరటనిస్తున్నాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో నిమ్మతోటలు బెట్టకు వచ్చాయి. ఈపరిస్థితుల్లో వర్షం కురుస్తుండడంతో నిమ్మచెట్లకు ఉపశమనం కలిగిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. వ్యవసాయాధికారులు తొందరపడి నార్లు పోసుకోవద్దని ఆర్బీకేల ద్వారా రైతులకు సమాచారం అందజేస్తున్నారు. బోరుబావులు ఉన్న రైతులు నీటి సదుపాయాన్ని బట్టి నార్లు పోసే కోవాలని ఏఓ హైమావతి రైతులకు సూచించారు.

డీవీ సత్రంలో వర్షం

దొరవారిసత్రం: మండల పరిధిలో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఎండ తీవ్రత తగ్గిపోయి చల్లటి గాలులు వీస్తూ అర్ధగంట పాటు ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది. నెలబల్లి, డీవీ సత్రం, ఎన్ఎం అగ్రహారం, అక్కపాక, పోలిరెడ్డిపాళెం గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాలు కారణంగా వాతవరణం చల్లబడడంతో జనం ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందారు.

సూళ్లూరుపేటలో భారీ వర్షం

సూళ్లూరుపేట రూరల్: మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. కోటపోలూరు రైల్వేఅండర్ బ్రిడ్జి మోకాల్లోతు వరకు వర్షపు నీరు చేరడంలో రాకపోకలు స్తంభించాయి. ఈ వర్షంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలను నమ్ముకుని రైతులు ఎడగారు సీజన్ కింద నాదేండ్ల వారికండ్రిగ, కోటపోలూరు. మంగళంపాడు ప్రాంతాల్లో 600 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇలుపూరులో వేరుశనగ పంట వేశారు. ఈ వర్షాలవల్ల తెగుళ్లు ఉంటే వెళ్లిపోయే అవకాశం ఉందని వ్యవసాయ అధికారి కవిత తెలిపారు.

సూళ్లూరుపేట: నైరుతి రుతుపవనాల రాకతో తొలకరి జల్లులు చల్లగా సూళ్లూరుపేట పట్టణాన్ని పలకరించాయి. అయితే వారం రోజులుగా ఎండలతో, ఉక్కపోతతో అల్లాడిపోయిన జనానికి రెండు మూడు రోజులుగా ఆకాశమంతా మేఘావృతమై చల్లటి గాలులు కూడా మెల్లగా పలకరించి కాస్తంత ఉపశమనాన్ని కలిగించాయి. దబుధవారం సాయంత్రం ఆకాశమంతా మేఘావృత్తమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. వర్షంతో రోడ్లపై వర్షపునీరు ప్రవహించాయి.

బాలాయపల్లిలో వడగళ్ల వాన

బాలాయపల్లి(సైదాపురం): మండలంలో బుధవారం మధ్యాహ్నం వాతావరణం మారిపోయింది విపరీతమైన పెనుగాలులతో వడగళ్ల వర్షం కురిసింది. అలిమిలి, వెంకటరెడ్డిపల్లి, అంబలపూడి, నిండలి గ్రామాల్లో పెనుగాలులు వీచడంతో సాగులో ఉన్న మామిడి పంట దెబ్బతినే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అన్నదాతల్లో ఆనందం

పెళ్లకూరు: మండలంలో బుధవారం కురిసిన వర్షానికి వరి పైర్లకు ఊరట లభించింది. కొంత కాలంగా ఖరీఫ్ రైతులు సాగునీటి కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈతరుణంలో కురిసిన ఓ మోస్తరు వర్షానికి వరి పొలాల్లోకి నీరు చేరింది. దీంతో రైతులు ఆనందంగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. చిల్లకూరు, పెళ్లకూరు, చావలి, తాళ్వాయిపాడు ప్రాంతాల్లో వరి సాగు చేస్తున్న రైతులంతా వర్షంతో ఊరట లభించడం వల్ల ఎరువులు వేసుకుంటామని హర్షం వ్యక్తం చేస్తున్నారు.